# నాగరికచిత్తి

## ఎమ్మెస్. సూర్యనారాయణ

ఒకానొక పొద్దుటిపూట.

నరసింగపురంలో కోతకొచ్చిన వరిపైరు బంగారంలా మెరుస్తోంది. దక్షిణంవైపు నుంచి వీచేగాలి పైరుమీంచి రహస్యంగా కదుల్తున్నప్పుడు.. పైరు బంగారు వింజామరే అవుతుంది.

సూర్యుడి లేత కిరణాలు వరిపైరు మీద ప్రసరించి అసలే బంగారు వన్నెతో మెరిసే పైరునీ.. వరికంకుల్నీ దేదీప్యమానం చేస్తున్నాయి.

అప్పుడు-

ఎక్కణ్ణుంచి వచ్చిందో ఓ పాలపిట్ట, రివ్వుమంటూ వరి కంకుపైన వాలింది.

దాని చిట్టి కాళ్ళకి రక్తం అంటుకుంది.






పాలపిట్ట భయపడి, ఉన్నట్టుండి గాల్లోకి లేచి, కొంచెం దూరం ఎగిరి, మరో వరికంకుపైన వాల బోయి, గాల్లోనే ఆగింది.

తను వాలాలనుకున్న ఆ వరికంకు కూడా భీక రంగా రక్తం వోడుతోంది.

ఎవరో రక్తాభిషేకం చేసినట్టు.. నెత్తుటి ముద్దలా వుంది!

పాలపిట్ట గజగజా వొణికిపోయింది.

ఒకానొక పొద్దుటిపూట.. నరసింగపురంలో బంగారు వరిపైరు నెత్తుటి వర్షంలో ఎలా తడిసిందో పాలపిట్టకి అర్థం కాలేదు.

అది తుర్రుమని పంటబోదె మీంచి ఎగిరింది.

బోదెలో నీళ్ళకి బదులు రక్తం ప్రవహిస్తోంది.

ఏపుగా ఎదిగి.. కోతకి సిద్ధమౌతోన్న పంట దేహాన్ని కుమ్మేసినట్టు చిందరవందరగా ఏవేవో గుర్తులు.. వందలకొద్దీ మనుషుల అడుగులు!

గాల్లోంచి తేలుతూ రక్తపు వాసన!

హఠాత్తుగా మహా విధ్వంసం జరిగిన సాక్ష్యంగా గాయాల జాడలు!

గాల్లో ఎగుర్తూ పరికిస్తున్న పాలపిట్టకి మతిపో యింది.

''పంట చేనమ్మా! వరికంకమ్మా! నిన్నలేని రక్తం ఇవ్వాళ నిన్నెలా అంటింది? ఈ అడుగులు ఎవరివి? నీ బంగారు దేహాన్ని పైశాచికంగా కుమ్మిపారేసిన భయంకరమైన వందలాది అడుగులూ..

గంభీరంగా.. నిఖార్సుగా.. గాండ్రించే గుండ్రటి పాదాలూ.. ఏమిటివి? అసలేం జరిగింది?'' అంటూ ఆరాతీసింది పాలపిట్ట.

నిన్నటి పొద్దుకీ, ఇవ్వాల్టి పొద్దుకీ మధ్య అంతరం ఎందుకో తెలీలేదు పాలపిట్టకి!

''ఏం చెప్పమంటావు పాలపిట్టా! నా పైన చింద రవందరగా పడిన వందలాది అడుగులు.. నన్ను తెగేసి అమ్ముకు తినే రెండుకాళ్ళ వాళ్ళవి. నువ్వ న్నట్టు గంభీరంగా, నిఖార్సుగా పడిన గుండ్రటి అడుగులు మాత్రం పులిబిడ్డవి!''

ఈ మాటలు అంటున్నప్పుడు వరిపైరు గొంతు గద్గదమయ్యింది.

''అవును. వాటిని చూసినప్పుడే పోల్చుకు న్నాను. అవి పులిగోర్లే అని'' అంది ఆశ్చర్యంగా పాలపిట్ట.

వరిపైరు మౌనంగా ఉండిపోయింది.

గాలికూడా ఆగిపోయింది.

పాలపిట్ట ఆశ్చర్యంగా, భయం భయంగా..

ఒక మహా విధ్వంసాన్ని తట్టుకోవడానికన్నట్టు గాల్లో గిరికీలు కొట్టి మళ్ళొచ్చి వరిపైరు ముందు ఉద్విగ్నంగా వాలింది.

ఉన్నట్టుండి వరిపైరు మీంచి గాలి మళ్ళింది. పైరు గొంతు సవరించుకుని పాలపిట్టకి జరిగింది చెప్పడం మొదలెట్టింది.

''ఎక్కడ పడితే అక్కడ ఉండదు పులిబిడ్డ.. ఏ చోటును పడితే ఆ చోటును తన ఆవాసం చేసుకోదు. ఆకలేస్తేనే గానీ వేటకి కదలదు. అట్లాంటి బిడ్డ రెండు రోజుల పాటు నా పొత్తిళ్ళ మధ్య తల దాచుకుంది'' అంటూ ఆగింది పైరమ్మ.

పాలపిట్ట కళ్ళు విశాలమయ్యాయి ఆ మాటలు విని.

''ఏవిటీ! రెండు రోజులు నీ వొళ్ళో దాంకుందా చిరుతా!'' అంటూ నోరెళ్ళబెట్టింది పాలపిట్ట.

''అవును.. రెండు రోజులు నాలోనే పొదివి పట్టు కున్నాను బిడ్డని. నా కడుపులో తీవిగా వొకింత జాలిగా, బోలెడు పౌరుషంగా తిరుగాడింది. తచ్చా డింది. నిద్రించింది. సేదతీరింది! నాకు చెప్పలేనంత ఆశ్చర్యం! నిజానికి ఒక పులి దాని మానాన అది ఏ చీకూ చింతా లేకుండా బతకాలంటే దానికి నలభై మైళ్ళ దట్టమైన అడవి కావాలి! అందులో కనీసం ఐదువందల జింకలుండాలి. దుప్పులుండాలి. తను తిని పారేసే కళేబరాల కోసం తోడేళ్ళూ, నక్కలూ వుండాలి. నీటి దొరువులుండాలి. జింకలకోసం, దుప్పుల కోసం ఏపుగా దట్టంగా విస్తరించి గడ్డి వుండాలి.. ఇన్ని వుంటే గింటే అప్పుడు అక్కడ ఒక్క పులి బిడ్డుండాలి. అదీ ఆ బిడ్డ రాజసం! అదీ తన జన్మలక్షణం. అటువంటి చిరుతపులిబిడ్డ ఈ నర్సిం గపురం చొరబాటుదార్ల స్థావరంలోకి వచ్చి...'' అని ఆగిపోయింది పైరు.

ఆపైన ఆమెకి దుఃఖం ఆగలేదు. భోరుమంది. గొంతు పూడిపోయింది.

పాలపిట్టకి భయమేసింది.

పదిమందికి అన్నంపెట్టి, ఆహారమయ్యే అద్భుత కల్పవల్లి, వరిపైరు కన్నీరు మున్నీరు కావడం పాలపిట్టకి అయోమయంగా తోచింది.

పంటచేను తనని తాను సంభాళించుకుని మళ్ళీ మాట్లాడ్డం మొదలుపెట్టింది.

''అంతా మాయగా జరిగిపోయింది. ప్రశాంత మైన వాతావరణంలో దూరంగా జోరుగా వరికో తలు సాగుతున్నాయి. ఏపుగా పెరిగిన నా వొళ్ళోకి దూసుకొచ్చింది పులిబిడ్డ. ఏమనాలో తెలీలేదు. ముద్దుగా కౌగిలించుకున్నాను అరుదైన చిరుతని'' అంటూ సంబరపడింది కొంతసేపు వరిపైరు.

పాలపిట్టకూడా పొంగిపోయింది.

వరిపైరు చెప్పసాగింది–

''పులిబిడ్డా.. దట్టమైన అడివి కడుపులో తిరగా ల్సిన దానివి. ఇలా మైదానంలోకి ఎలా వచ్చావు? ఎక్కణ్ణుంచి వచ్చావు?'' అని ప్రేమగా అడిగాను.

శంఖవరం అడవిలోంచి.. ఏలేరు కాలువ ఈదు కుంటూ వచ్చానంది.

సరే.. ఇలా ఏల వచ్చావు? అనడిగాను.

పౌరుషంగా గాండ్రించింది.

బిడ్డా.. ఇది నీ తావుకాదు. ఇది నీ దోవకాదు. ఆపదలో పడతావు. ఎలా వచ్చావో అలాగే వెళ్ళిపో అని బుజ్జగించాను. వింటేనా?

'' ఎక్కడికని వెళ్ళను? ఏముందని వెళ్ళను? పచ్చి మంచినీటి దొరువైనా లేని నెలవులో కొలువు ఎలా కుదురుతుందో'' చెప్పమని నిలదీసింది.

బిడ్డకి ఏం చెప్పాలో నాకు నోటమాట పెగల్లేదు.

అయినా తగుదునమ్మా అని నేను మాత్రం ఏం చెప్పగలనూ?

ఒకప్పుడు నా వరికంకుల్లో, నా మట్టి గుండెలో పునరుత్పత్తి శక్తి వుండేది. నాగేటి చాళ్ళు తీస్తున్న ప్పుడు ఎడ్లకాళ్ళ గిట్టల కింద నుంచీ జీవశక్తి తరం గించేది. విత్తునుంచి విత్తుకి, పంటనుంచి పంటకి–

ఒక అద్భుత ప్రయాణం కొనసాగుతూ వుండేది. పశువుల పేడ, పెంటతో, వాటి మూత్రంతో.. వాటి అడుగుల పాటు వాన దేవుడు నన్ను ముద్దుగా తడి పినప్పుడు నాలో గొప్ప పులకింత.. అందుకే పొంగి పోయి నిండుగా బతుకుని విరగపండించుకునే దాన్ని.

కానీ ఇప్పుడు? నాలో జీవశక్తిని దోచుకుపో యారు. యంత్రాల్లో నన్నో పనికిమాలిన దానినిగా తయారు చేశారు. నాలో విషప్రయోగాలు అనేకం చేశారు. నాలో సారం మరణించింది. నా రూపురే ఖలు మారిపోయాయి. సారహీన స్వరంతో ఇప్పుడు నేనేం మాట్లాడినా హాస్యాస్పదంగానే వుంటుంది.

రోలొచ్చి మద్దెలతో మొరపెట్టుకున్నట్టు–

పులొచ్చి పంటచేనులో దాంకుంటే..

వెలువడే మాటలు చచ్చుబడి పోతాయి.

అయినా ఎలాగో సిగ్గు విడిచి పులిబిడ్డకి ఏవేవో సుద్దులు చెప్పాను. రెండురోజుల పాటు రాత్రీ, పగలూ మా యిద్దరి మధ్యా సుదీర్ఘ చర్చలు కొనసా గాయి.

పులిబిడ్డ నాతో అంది కదా–

''నేనుండే అడివిని ఆక్రమించుకున్నారు. అర

ణ్యాలు ఎప్పుడో పోయి వాటి స్థానంలో అభయారణ్యాలు వచ్చాయి. గతంలో ఈ అభయారణ్యాల చుట్టూ పక్కల రైతులు జొన్నలు, రాగులు, వరి వంటి పంటలు వేసేవారు. దానివల్ల పశువులకు కావల్సినంత గడ్డిదొరికేది. కానీ బంగారం మాయ కమ్ముకుంది. తెల్లబంగారం అంటూ పత్తి పండి లాభం ఏమొచ్చిందో తెలీదుకానీ మేత లేక పశువులు అల్లల్లాడాయి. నాకోసం కేటాయించిన అభయారణ్యాల్లోకి మేకలు, గొర్రెలు, ఆవులు వంటి లక్షల జీవాలు వచ్చిపడ్డాయి. లేళ్ళకి, దుప్పులకి కావలసిన గడ్డిని ఊడ్చి పారేశాయి. చివరికి నాకు గొంతెండింది. నీరు తాగబోతే నీటి దొరువు దగ్గర సైతం నాకు ఏకాంతం లేదు. ఇది చాలదన్నట్టు ఈ దుష్టులు నీకే కాదు, నాకూ విషమే పెట్టారు. వినోదం కోసం నా ఇంటిని ఆక్రమించారు. నేనేమో ఒంటరినైపోయాను. ఏంటి చేనమ్మా! నేను తిండి తిని వారం రోజులయ్యింది. నా పంటిమధ్య మాంసం ముక్క పడి ఎన్నాళ్ళో అయ్యింది. పచ్చిమంచినీళ్ళు లేవు. నేనీ నరజాతిని క్షమించను. వీళ్ళకి ఇవాళ నేను మరణశిక్ష విధిస్తున్నాను. ఇవాళ నాకు విందుభోజనం! పంటచేనమ్మా.. నన్ను నీ కడుపులో దాచుకోవమ్మా! నా జాతికోసం నీతిలేని ఈ రెండుకాళ్ళ జంతువుల్ని బలి ఇచ్చి తీరాలి..'' అంటూ బిడ్డ నిద్రలో కూడా ఆకలితో పలవరించింది.

నాకు దుఃఖం ఆగలేదు పాలపిట్టా!

నేను నిస్సహాయురాలిని. నేను పులిబిడ్డకి ఆహారం కాదు. ఎందరికో ఆహారమ్మై ఉద్ధరించే నేను నా బిడ్డకి కడుపు నింపలేకపోయాను'' అంటూ పొగిలి పొగిలి ఏడుస్తున్న వరిపైరుని ఎట్లా ఓదార్చాలో పాలపిట్టకి పాలుపోలేదు.

అప్రయత్నంగా అదికూడా ఏడ్చింది.

''ఆ తరువాత ఏం జరిగిందీ?'' పాలపిట్ట భయంగా ప్రశ్నించింది.

''కొన్ని గంటల పాటు పులిబిడ్డ వీరవిహారం చేసింది. ఒక్క బిడ్డతో యుద్ధానికి వందలాది మంది రక్త పిశాచాల్లా కలిసొచ్చారు. పులిబిడ్డకి పంజాయే ఆయుధం. అంతకుమించిన వ్యూహాలు లేవు. కానీ రెండుకాళ్ళ వాళ్ళు ప్రాణభయంతో నాలుగు వైపుల్నుంచీ కమ్ముకున్నారు. కర్రలతో, కత్తులతో గొడ్డళ్ళతో వందలాది మంది అభిమన్యుడిని చుట్టుముట్టినట్టు పట్టుపట్టి మట్టుపెట్టారు. తుపాకులతో కాల్చారు. ఏ కండ కాకండ చీల్చారు. భుజాలకెత్తుకుని పైశాచిక నృత్యం చేశారు. పులిబిడ్డ వీరమరణం రెండుకాళ్ళ వాడికి ఆఖరి చరణం! ఈ దారుణం చూశాక నాకు ఒక్కటే అనిపిస్తోంది పాలపిట్టా'' అంటూ వరిపైరు ఆగింది.

పాలపిట్ట చెవులు రిక్కించింది.

వీళ్ళకి నేను ఆహారమయినందుకు సిగ్గుతో చితికిపోతున్నాను.

నా బిడ్డకి ఆహారం కానందుకు దుఃఖిస్తున్నాను'' అంటూ వరిపైరు బావురుమని ఏడ్చింది.

పంటచేను చేనంతా ద్రవించింది.

పాలపిట్ట ఏడ్చింది.

వరిపైరు కన్నీళ్ళూ, పాలపిట్ట కన్నీళ్ళూ పంట బోదెలోని రక్తంలో కలిశాయి.

* * *

ఉన్నట్టుండి గాల్లోకి లేచింది పాలపిట్ట.

ఎక్కడికి? రెండు ధాన్యపు గింజలు కొరికి పొమ్మంది వరిపైరు. పాలపిట్ట వినలేదు.

రివ్వుమని పైకి లేచి.. పులికి నివాళి ఇచ్చి వస్తానని ఆవేశంతో బయలుదేరింది. వరిపైరు నివ్వెరపోయింది.

పాలపిట్టని ఆపలేకపోయింది.

రివ్వున పులికి దహన సంస్కారం జరిగే చోటకి చేరుకుంది పిట్ట.

చిరుత దేహం చితిమంటపై రగుల్తోంది.

పాలపిట్ట రెండు కన్నీటి బొట్లు తర్పణ చేసింది.

అంతే - హఠాత్తుగా ఎక్కణ్ణుంచో ఒక ఉండేలు దెబ్బ!

చూస్తుండగానే పాలపిట్ట చిరుత చితిలోకి జారిపోయింది.

మహా ప్రళయం ఒకటి...

మనిషి కోసం కన్ను తెరిచింది!

★

## ఆరోగ్యాన్నిచ్చే ఆర్గానిక్ ఫ్రూట్స్...

ఆహారం అలవాట్లు మార్చుకోవాలనుకుంటున్నారా? అయితే పండ్లు తినడం అలవాటు చేసుకోండి. సీజనల్‌గా వచ్చే ప్రతి ఫలాన్ని తినడం అలవాటు చేసుకోండి. రోజూ ఆహారంగా వీటిని స్వీకరించాలి. ముఖ్యంగా ఇవి ఆర్గానిక్ ఫలాలైవుండాలి. అలాగే కూరలు కూడా. వీటిలో మామూలు ఫలాల్లో కంటే అత్యధికమైన పోషకవిలువలుంటాయి. రుచిలో కూడా మిన్నగా వుంటాయి. ఇందులో గల విటమిన్ ఎ- ఆరోగ్యకరమైన చూపునిస్తుంది. చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. ధాటిగా కన్పించే ఆరంజ్, ఎరుపు, పసుపు రంగు గల కూరలు, ఫలాలలో బెటాకెరొటిన్ కలిగివుంటుంది అంటే -చిలకడదుంప, టమోటా, గుమ్మడి, బొప్పాయి, మామిడి, అప్రికోట్స్ వంటి వాటిల్లో..విటమిన్ ఇ -శరీరంలో కణాలను కాపాడే యాంటిఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. వయసులో ముదిమితనాన్ని, కాన్సర్‌ని అరికడుతుంది. పాలకూర వంటి ఆకుకూరలు తీసుకోవాలి. గాయాలను త్వరగా మాన్పించే సి విటమిన్ కోసం టమోటాలు, నిమ్మ, నారింజ, బఠానీ తీసుకోవాలి. పొటాషియం కోసం-బీట్‌రూట్, అరటి, డ్రై ఫ్రూట్స్, మాగ్నీషియం కోసం-బీన్స్, ఎండు అప్రికోట్స్, రక్తంలో సెరిపడ హిమగ్లోబిన్‌ని అందచేసే ఐరన్ పదార్థం గల ఆకు కూరలు, మాంగనీస్‌కోసం-పైన్‌యాపిల్ తీసుకోవాలి. ఇవి-అధికశక్తినే కాదు అమిత ఉత్సాహాన్ని కూడా యిస్తాయి.





